



EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
మంగళవారం
14 మే 2024
పేజీలు: 02




## పాయింట్స్ టేబుల్

| టీమ్ | ఆడినవి | గెలిచినవి | ఓడినవి | రన్ రేట్ | పాయింట్స్ |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 13 | 9 | 3 | 1.42 | 19 |
| రాజస్తాన్ | 12 | 8 | 4 | 0.34 | 16 |
| చెన్నై | 13 | 7 | 6 | 0.52 | 14 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 0.40 | 14 |
| బెంగళూరు | 13 | 6 | 7 | 0.38 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | -0.48 | 12 |
| లక్నో | 12 | 6 | 6 | -0.76 | 12 |
| గుజరాత్ | 13 | 5 | 7 | -1.06 | 11 |
| ముంబై | 12 | 4 | 8 | -0.21 | 8 |
| పంజాబ్ | 12 | 4 | 8 | -0.42 | 8 |

Eliminated

## నేటి మ్యాచ్

ఢిల్లీ X లక్నో
ఢిల్లీ, రా.7.30

# వారణాసిలో నామినేషన్ వేసిన ప్రధాని నరేంద్ర మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి వారణాసి లోక్ సభ స్థానానికి పోటీ చేస్తూ.. నామినేషన్ వేశారు. ఇప్పటికే రెండుసార్లు భారీ విజయాన్ని అందుకున్న ఆయన.. మూడోసారి కలెక్టర్ ఆఫీసుకి వెళ్లి.. నామినేషన్ వేశారు. కలెక్టర్ ఆఫీసులోకి ప్రధాని మోదీ ఒక్కరే వెళ్లారు. ఆయన వెంట సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే వెళ్లారు. ప్రధాని నామినేషన్ ను నలుగురు నేతలు బలపరిచారు. వారిలో ఒకరు అయోధ్య రామాలయ పూజారి, ఒకరు దళితులు, ఇద్దరు ఓబీసీ నేతలు ఉన్నారు. ప్రధానికి ప్రత్యర్థిగా కాంగ్రెస్ నుంచి అజయ్ రాయ్ పోటీ చేస్తున్నారు.ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకి మ్యాజిక్ మార్క్ రావడమే కష్టం అని ఇండియా కూటమితోపాటూ.. కొన్ని ప్రతిపక్షాలు అంటుంటే.. సొంతంగా 370, కూటమితో కలిసి 400 సీట్లు సాధించాలనుకుంటున్న బీజేపీ.. భారీ ప్రచారంతో ప్రతిపక్షాలకు షాక్ ఇస్తోంది. నిన్న వారణాసిలో భారీ రోడ్ షో నిర్వహించిన మోదీ.. దానితోనే.. తాను ఏం చేసినా భారీగానే ఉంటుందని మరోసారి ప్రతిపక్షాలకు సంకేతం ఇచ్చారు. ఇవాళ నామినేషన్ సందర్భంగా.. భారీ రోడ్ షో, ప్రచార సభ జరగనున్నాయి. ఇవాళ ఎన్డీఏ నేతల సమావేశంలో కూడా మోదీ పాల్గొంటారు. వారణాసిలో ప్రధాని నామినేషన్ దాఖలుకు ముందు కాశీ ఆలయాల్లో పూజలు చేశారు.





## వారణాసి చేరుకున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారణాసి చేరుకున్నారు. ప్రధాని నరేంద్రమోడీ నామినేషన్ కార్యక్రమంలో వీరిద్దరూ పాల్గొన్నారు. మోడీ నామినేషన్ అనంతరం ఎన్టీయే సమావేశంలోనూ చంద్రబాబు, పవన్ పాల్గొనే అవకాశముంది.



## దశాశ్వమేథ ఘాట్‌లో ప్రధాని మోదీ పూజలు

ప్రధాని మోదీ ఇవాళ వారణాసిలో లోక్‌సభ ఎన్నికల కోసం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గంగా నది తీరంలో ఉన్న దశాశ్వమేథ ఘాట్‌లో ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆయన గంగా హారతి నిర్వహించారు. నామినేషన్ దాఖలు సందర్భంగా కేంద్ర మంత్రులు షా, రాజ్‌నాథ్, బీజేపీ ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ప్రధాని మోదీతో పూజారి రామణ్ పూజలు చేయించారు. దేశ సంక్షేమం కోసం గంగా పూజ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. మూడవ సారి మోదీ ప్రధాని కావాలని, దేశ ప్రఖ్యాతలు ప్రపంచవ్యాప్తంగా వెలిగిపోవాలని కోరుకున్నట్లు పూజారి రామణ్ వెల్లడించారు. అన్ని దశల ఎన్నికల్లో ప్రధాని మోదీకి ఘన విజయం లభించాలని ఆశీర్వదించినట్లు మరో పూజారి సంతోష్ నారయన్ తెలిపారు.



## ప్రయాణికులతో కిక్కిరిసిన హైదరాబాద్ మెట్రో

హైదరాబాద్ మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లిన వారు తిరిగిరావడంతో మెట్రోలో రద్దీ పెరిగింది. ప్రధానంగా ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వైపు రైళ్లలో ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారు. సాధారణంగా ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు మెట్రో సేవలు ప్రారంభమవుతాయి. కానీ, మంగళవారం 5.30 నుంచే రాకపోకలు మొదలయ్యాయి. రద్దీ దృష్ట్యా మరిన్ని ట్రిప్పులు నడిపే అవకాశముంది.




## నేటి మ్యాచ్‌లో ఎవరు గెలిచినా ఆర్‌సీబీకి ప్లస్

ఐపీఎల్ 64వ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ గెలిస్తే, ఆర్‌సీబీని అధిగమించి 5వ స్థానానికి చేరుకుంటుంది. అయితే, నెట్ రన్ రేట్‌లో ఆర్‌సీబీ జట్టు ముందుంది. తద్వారా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఆర్‌సీబీ జట్టు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును అధిగమించే అవకాశం ఉంది. పీఎల్ 64వ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్‌జెయింట్‌లు తలపడనున్నాయి. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో జరగనున్న ఈ మ్యాచ్ ఇరు జట్లకు కీలకం. ఎందుకంటే, రెండు జట్లు ప్లేఆఫ్ రేసులో ఉన్నాయి. కాబట్టి, రెండు జట్లకు ఇది డూ ఆర్ డై మ్యాచ్.మరో వైపు ఈ మ్యాచ్ ఫలితం ఆర్సీబీ జట్టు ప్లేఆఫ్ పథాన్ని కూడా నిర్ణయించనుంది. అంటే, ఈరోజు జరిగే మ్యాచ్‌లో ఏ జట్టు గెలుస్తుం దనే దానిపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేఆఫ్ మార్గం సుగమం అవుతుంది. దీని ప్రకారం ఆర్సీబీకి ఈరోజు జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ గెలవడం ఉత్తమం. ఎందుకంటే 12 పాయింట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నెట్ రన్ రేట్ -0.482. నెట్ రన్ రేట్‌లో ఆర్‌సీబీ (+0.387)ని అధిగమించాలంటే ఢిల్లీ క్యాపిటల్స్ కనీసం 100 పరుగుల తేడాతో గెలవాలి. ఇంత గొప్ప విజయం సాధిస్తేనే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నెట్ రన్ రేట్‌లో ఆర్‌సీబీని అధిగమించగలదు. ఇదిలా ఉంటే లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఓడిపోతే 16 పాయింట్లు సేకరించే అవకాశాన్ని కోల్పోతుంది. అంటే ఎల్ఎస్‌జీ జట్టుకు మరో 2 మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లలో గెలిస్తే మొత్తం 16 పాయింట్లు పొందుతారు. దీని కారణంగా, ఆర్‌సీబీ ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించవచ్చు. ఈరోజు జరిగే మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఓడిపోతే ఆర్సీబీకి ప్లేఆఫ్‌లోకి ప్రవేశించే అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల, ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో లక్నో సూపర్‌జెయింట్‌తో జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తక్కువ పరుగులతో లేదా సాధారణంగా గెలవాలి. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి ఎగబాకనుంది. అయితే, సీఎస్‌కే జట్టుపై గొప్ప విజయం సాధించడం ద్వారా పాయింట్ల పట్టికలో 4వ స్థానానికి చేరుకోవడానికి ఆర్‌సీబీకి మంచి అవకాశం ఉంది. కాబట్టి, ఆర్‌సీబీకి ఈరోజు జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ గెలవడం మంచిది.



## యూపిఐకి జొమాటో గుడ్‌బై

ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో.. పేమెంట్స్ సేవలకు గుడ్‌బై చెప్పింది. తమ పేమెంట్ అగ్రిగేటర్, వాలెట్ లైసెన్స్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు జొమాటో పేమెంట్ లిమిటెడ్ స్వచ్ఛందంగా అప్పగించింది. 'ఆన్‌లైన్ పేమెంట్స్ విభాగంలో ప్రత్యర్థి సంస్థలకు పెద్దగా పోటీనివ్వలేకపోయాం. అందుకే ఈ పేమెంట్స్ వ్యాపారం మాకు లాభదాయకం కాదని గ్రహించాం'. అని జొమాటో స్పష్టం చేసింది.



## ముంబైలో దుమ్మురేపిన గాలివాన

ముంబైలో గాలివాన బీభత్సం సృష్టించింది. కుర్లా, ఘాట్ కోపర్, ములుండ్, విక్రోలి, దక్షిణ ముంబయి, మాహిమ్, దాదర్ లోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. వర్షానికి ముందు బలమైన ఈదురు గాలులు వీచాయి. పలుచోట్లా దుమ్ము దట్టంగా ఎగిసిపడింది. వర్షం, ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు మెట్రోసేవలను, రైలు సేవలను నిలిపివేశారు.



## వ్యాపారవేత్త ఇంటి నుంచి రూ.72 లక్షలు సీజ్

మధ్యప్రదేశ్‌లో ఓ వ్యాపారవేత్త ఇంటి నుంచి పోలీసులు సుమారు రూ.72 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. భోపాల్‌లో అతని ఇంటి నుంచి ఆ సొమ్మును రికవరీ చేసుకున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నది. చిరిగిన, పాత నోట్లను మార్పిడి చేస్తున్నట్లు ఆ వ్యాపారవేత్త తెలిపాడు. ఆర్బీఐ ఆమోదం పొందిన ఏజెంట్‌ను అని ఆ వ్యాపారి చెబుతున్నాడు. అశోకా గార్డెన్ లోకాలిటీలో ఉన్న ఇంట్లో పోలీసులు రెయిడ్ చేశారు. హవాలా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఆ ఇంట్లో సోదాలు చేశారు. ఒకే ఇంట్లో నుంచి 32 లక్షల నగదును సీజ్ చేసి ఆ ఇంటికి తాళం వేశారు. ఇక బైరాఘర్ ఏరియాలో ఉన్న అతని సహచరుడి ఇంటి నుంచి సోమవారం రోజున సుమారు 41 లక్షలు సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న డబ్బు గురించి ఆదాయపన్ను శాఖ అధికారులకు పోలీసులు తెలిపారు.


## ఎన్డీఏ కూటమికి 400 సీట్లు పక్కా..

**మోదీ ప్రధాని అవడం ఖాయం..**

**చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**



ప్రధానమంత్రి నరేంద్రమోదీ నామినేషన్ ప్రక్రియకు హాజరయ్యారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు. కాసేపటి క్రితం వారణాసి చేరుకున్న ఆయన.. మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయం అన్నారు. ఏపీలో సార్వతిక ఎన్నికలు మే 13న ముగియడంతో ప్రస్తుతం మోదీకి మద్దతుగా నిలిచారు చంద్రబాబు. ఈరోజు ప్రధాని మోదీ వారణాసిలో నామినేషన్ వేయనున్నారు. ఈయన నామినేషన్ ర్యాలీలో పాల్గొననున్నారు. దీంతో పాటూ ఏపీలో జరిగిన పోలింగ్ సరళిపై కూడా చర్చించే అవకాశం ఉందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఈ క్రమంలోనే ఓ మీడియా ఇంటర్వూలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో క్లీన్ స్వీప్ చేస్తాం అన్నారు. పోలింగ్ సరళి బాగా జరిగిందని పేర్కొన్నారు. ఏపీలో అధికారంలోకి వచ్చేది ఎన్డీయే ప్రభుత్వంమే అని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో పాటు కేంద్రంలో ఈసారి ఎన్డీఏ కూటమికి 400 సీట్లు పక్కాగా వస్తాయన్నారు. దేశవ్యాప్తంగా ఎన్డీఏ సత్తా చాటుతుందని చెప్పారు. మరోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ కొనసాగుతారని జోస్యం చెప్పారు. ఏపీలో బీజేపీతో పొత్తులో ఉన్న చంద్రబాబు సార్వత్రిక ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే మోదీని కలవడంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కేవలం నామినేషన్ ప్రక్రియలో పాల్గొనడం కోసమే వెళ్లారా లేక ఏపీ రాజకీయాలపై చర్చించేందుకు వెళ్లారా అన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి.




## రేపే 85 సెకన్ల టీజర్ డబుల్ ఇస్మార్ట్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ డబుల్ ఇస్మార్ట్. ఈ చిత్రం ఇస్మార్ట్ శంకర్ చిత్రానికి సీక్వెల్ గా తెరకెక్కుతోంది. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం నుండి మే 15 వ తేదీన టీజర్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే టీజర్ కి సంబందించిన మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ను మేకర్స్ నేడు అందించారు. 85 సెకన్ల నిడివి తో టీజర్ ఉండనుంది. ఇది ప్యూర్ రామ్ పోతినేని మ్యాడ్ నెస్ తో ఉండనుంది అని మేకర్స్ హామీ ఇస్తున్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## విడాకులు తీసుకున్న జివి ప్రకాష్ కుమార్ – సైంధవి

కోలీవుడ్ ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అయిన జీవి ప్రకాష్ కుమార్ అతని భార్య అయిన సైంధవి విడిపోయారు అంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే వాటిపై క్లారిటీ ఇస్తూ తాజాగా సోషల్ మీడియా లో ప్రెస్ నోట్ ను రిలీజ్ చేయడం జరిగింది. చాలా ఆలోచన తర్వాత, సైంధవి మరియు నేను 11 సంవత్సరాల వివాహం తర్వాత విడిపోవాలని నిర్ణయించుకున్నాము. మా మానసిక శాంతి మరియు మెరుగుదల కోసం. పరస్పర గౌరవాన్ని కాపాడుకుంటూ విడిపోతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సమయంలో ప్రతి ఒక్కరూ తమ గోప్యతను అర్థం చేసుకోవాలని మరియు గౌరవించాలని ఆయన కోరారు. జివి ప్రకాష్ ఆస్కార్ అవార్డు గ్రహీత స్వరకర్త ఎఆర్ రెహమాన్ మేనల్లుడు. అతను 2013లో సైంధవిని వివాహం చేసుకున్నాడు. సైంధవి ఒక ప్రముఖ సింగర్. జీవి ప్రకాష్ కంపోజ్ చేసిన అనేక సూపర్‌హిట్ పాటలను కూడా ఆమె పాడారు. వీరికి 3 సంవత్సరాల కుమార్తె ఉంది. ఈ ప్రెస్ నోట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది.

## ఢిల్లీ మద్యం కేసులో కవిత
## జ్యుడిషీయల్ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ మద్యం కేసులోబీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది కోర్టు. ఈడీ కేసులో రిమాండ్ ముగియడంతో కవితను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీహార్ జైలు నుంచి హాజరు పరిచారు అధికారులు. దర్యాప్తు కొనసాగుతున్నందున రిమాండ్ పొడిగించాలని కోర్టును ఈడీ కోరింది. ఈడీ విజ్ఞప్తి మేరకు ఈ నెల 20వ తేదీ వరకు కస్టడీ పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 8 వేల పేజీల సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు ఈడీ తెలిపింది. సప్లిమెంట్ ఛార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై ఈ నెల 20న కోర్టు విచారణ చేపట్టనుంది.



## మోస్ట్ వాంటెడ్ పీపుల్ స్మగ్లర్
## 'ది స్కార్పియన్' అరెస్ట్

ఐరోపా, బ్రిటన్‌లోకి వేల సంఖ్యలో మనుషులను అక్రమ రవాణా చేసిన కింగ్‌పిన్ 'ది స్కార్పియన్'ను ఎట్టకేలకు ఇరాక్‌లో యుకె పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల బ్రిటన్‌కు చెందిన బిబిసి చేసిన ఇన్వెస్టిగేషన్‌లో అతడిని ఇరాక్‌లోని సులేమానియా సిటీలో గుర్తించారు. దీని ఆధారంగా యూకేకు చెందిన నేషనల్ క్రైమ్ ఏజెన్సీ ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతంలో అతడిని అరెస్టు చేసింది. అతడి గ్యాంగ్ ఏకంగా 10 వేల మందిని అక్రమంగా ఇంగ్లీష్ ఛానెల్ దాటించి బ్రిటన్‌లోకి చేర్చి ఉంటుందని అంచనా. స్కార్పియన్ అసలు పేరు బర్జాన్ మాజిద్.

అన్న మొదలుపెట్టిన మానవ అక్రమ రవాణా....

వాస్తవానికి 2006లో మాజిద్ కూడా యుకె లోకి అక్రమంగానే ప్రవేశించాడు. అతడిని దాదాపు 11 ఏళ్లు జైల్లో ఉంచి చివరికి ఇరాక్‌లో వదిలేశారు. ఆ తర్వాత తన అన్న మొదలుపెట్టిన మానవ అక్రమ రవాణాను అతడు కొనసాగించాడు. మాజిద్‌పై బెల్జియం కోర్టులో కేసు ఉంది అయితే కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఆ కేసులో ఇప్పటికే న్యాయస్థానం 10 ఏళ్ల జైలు శిక్ష, 9,6,800 యూరోల ఫైన్‌ను విధించింది. ముందుగా మాజిద్‌ను మొబైల్ నెంబర్ ఆధారంగా గుర్తించారు. పోలీసులు అక్రమ వలసదారులను అరెస్టు చేసిన సమయంలో వారి మొబైళ్లలో ఒక నెంబర్ తరచూ కనిపించేది. దానికి స్కార్పియన్ అని






పేరు గానీ, బొమ్మ గాని గుర్తుగా పెట్టుకొని సేవ్ చేసేవారు.

రెండేళ్లుగా ఆ గ్యాంగ్‌లో 26మంది అరెస్ట్

కుర్దిస్థాన్‌లో ఇంట్లో మాజిద్ ఉండగా యుకె అధికారులు వెళ్లి అరెస్టు చేశారు. అతడిపై ఉన్న నేరాలను ముందుగా దర్యాప్తు చేస్తామని, ఆ తర్వాత ఐరోపా దేశాల్లో నిందితుడిని ప్రశ్నించేందుకు అధికారులకు అనుమతినిస్తామన్నారు. ఈ గ్యాంగ్ 2016-21 మధ్యలో భారీ స్థాయిలో మానవ అక్రమ రవాణాకు పాల్పడిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గత రెండేళ్లుగా ఆ గ్యాంగ్‌కు చెందిన దాదాపు 26 మందిని అరెస్టు చేశారు.



## మతిపోగొడుతున్న రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక మందన్న తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోస్ కుర్రకారుకు యమ కిక్కిస్తున్నాయి. హాట్ డోస్ దట్టిస్తూ మైమరిపించే లుక్స్ పోస్ట్ చేసింది ఈ ముద్దుగుమ్మ.గత కొన్నేళ్లుగా టాలీవుడ్ లో కన్నడ భామ రష్మిక మందన్న ట్రెండ్ కంటిన్యూ అవుతోంది. కెమెరా ముందు తనదైన ప్రతిభ కనబర్చుతూ నేషనల్ క్రష్ గా క్రేజ్ కొట్టేసింది రష్మిక. ఛలో సినిమాతో ఎంట్రీ ఇచ్చి వరుస సినిమాతో బిజీ హీరోయిన్ అయింది.పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించి స్టార్ స్టేటస్ పట్టేసిన రష్మిక.. ప్రస్తుతం సక్సెస్ జోష్‌లో ఉంది. టాలీవుడ్‌లో పలు బ్లాక్ బస్టర్స్ అందుకున్న ఈ బ్యూటీ.. బాలీవుడ్‌లో కూడా అదృష్టం పరీక్షించుకుంటోంది. ఈ మేరకు అవకాశాల వేట కొనసాగిస్తోంది.మరోవైపు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ రోల్ పోషిస్తూ ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోస్ షేర్ చేస్తోంది రష్మిక. ఈ క్రమంలోనే తాజాగా ఆమె పోస్ట్ చేసిన కొన్ని ఫొటోస్ వైరల్ అవుతున్నాయి. ఖతర్నాక్ పోజులతో కుర్రకారు గుండెకు గాయం చేసింది రష్మిక. దీంతో ఈ ఫొటోస్ వైరల్ అవుతున్నాయి.



## చార్‌ధామ్ యాత్ర మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్

సామర్థ్యానికి మించి ప్రయాణికులు రావడంతో ట్రాఫిక్ వ్యవస్థ అధ్వానంగా మారింది. గంగోత్రి యాత్ర మార్గంలో గంగ్నాని, గంగోత్రి మధ్య సుమారు 60 కిలో మీటర్ల దూరంలో రోజంతా సుమారు 900 ప్యాసింజర్ వాహనాలు ట్రాఫిక్ జాబ్‌లో చిక్కుకున్నాయి. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు ఉత్తరకాశీ, భట్వాడి, శివ గుఫా, నాగున్ బారియర్ వద్ద వాహనాలను నిలిపివేసి గంగోత్రి వైపు వెళ్లే వాహనాల ఒత్తిడిని తగ్గించారు.



## యూపీలో కారు ప్రమాదం.. ఆరుగురు మృతి

ఉత్తరప్రదేశ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బ్రజ్‌ఘాట్ టోల్ ప్లాజా వద్ద ఓ కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆరు మంది మృతిచెందారు. ఓ ట్రక్కును కారు ఢీకొన్నది. సోమవారం అర్థరాత్రి ఈ ప్రమాదం జరిగింది. అదుపు కోల్పోయిన కారు డ్రైవర్ తన వాహనంతో ట్రక్కును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డవారిని మీరట్ ఆస్పత్రిలో చేర్పించారు. అర్థరాత్రి 12.30 నిమిషాలకు ప్రమాదం జరిగినట్లు ఎస్పీ అభిషేక్ వర్మ తెలిపారు.





## బాలీవుడ్‌లో బంపరాఫర్

మలయాళీ భామ కీర్తి సురేష్‌కు గత ఏడాది బాగా కలిసొచ్చింది. తెలుగులో దసరా, భోళాశంకర్ విజయాలు ఆమె కెరీర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ప్రస్తుతం ఈ భామ తమిళంలో మూడు సినిమాలతో బిజీగా ఉంది. మరోవైపు ఈ ఏడాది 'బేబీ జాన్' చిత్రంతో హిందీ చిత్రసీమలో అరంగేట్రం చేస్తున్నది కీర్తి సురేష్. వరుణ్‌ధావన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ జరపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం కీర్తి సురేష్ హిందీలో బంపరాఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అక్షయ్‌కుమార్ హీరోగా ప్రియదర్శన్ దర్శకత్వంలో ఓ సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌కు బాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఇందులో కీర్తి సురేష్‌ను కథానాయికగా ఖరారు చేయబోతున్నారని తెలిసింది. హీరోయిన్ పాత్ర కోసం అలియాభట్, కియారా అద్వాణీ పేర్లను పరిశీలించిన చిత్ర బృందం చివరకు కీర్తి సురేష్‌ను కన్‌ఫర్మ్ చేసిందని తెలుస్తోంది.